ప్రజాశక్తి

మంగళవారం 4 ఫిబ్రవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కును నిలబెట్టే చర్యలివేనా?

- స్టీల్‌ప్లాంట్ భద్రతా సిబ్బంది కుదింపునకు రంగం సిద్ధం..
- ఉక్కు భూములు, ఆస్తుల కాజేతకే కేంద్రం మొగ్గు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కు పరిశ్రమకు ఇంతవరకూ రక్షణ కవచంగా ఉండే సిఐఎస్ఎఫ్ బలగాలను తప్పించి ప్రైవేట్‌కు కట్టబెట్టే చర్యల దిశగా కేంద్రంలోని మోడీ సర్కారు అడుగులు వేస్తోంది. సుమారు వెయ్యి మంది సిఐఎస్ఎఫ్ సిబ్బంది విశాఖ ఉక్కులో విధుల్లో ఉన్నారు. నలభై ఒక్క సంవత్సరాల నుంచీ ప్రభుత్వ రంగ పరిశ్రమ 'విశాఖ ఉక్కు'లో ఆస్తులకు రక్షణ కల్పిస్తున్న సిఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిలో సగం మందిని కుదించాలని యాజమాన్యం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంట్లో భాగంగా తొలి దశలో 438 మందిని తగ్గించాలని యాజమాన్యం నిర్ణయించినట్లు సమాచారం. కేంద్రం అండలేకుండా యాజమాన్యం ఇలా వ్యవహరిస్తుందా? అంటే కేంద్ర ఆదేశాలతోనే జరుగుతుందంటూ పలువురు కార్మికులు వాపోతున్నారు.

ఇప్పటికే అగ్నిమాపక విభాగాన్ని ప్రైవేట్‌కు కట్టబెట్టే పనులు 'ఉక్కు'లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఉక్కుకే కాదు ఈ చర్యతో ఉక్కు ఆస్తులూ ప్రమాదంలో పడినట్టే లెక్క. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు ఏ ప్రమాదమూ లేదు. ప్రైవేటీకరణ ఆగిపోయింది. కేబినెట్ నిర్ణయాన్ని రివర్స్ చేశామంటూ నిన్నగాక మొన్న విశాఖలో ప్లాంట్ అధికారులు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులతో జరిగిన భేటీలో వెల్లడించి హస్తినకు వెళ్లిన కేంద్ర ఉక్కు, గనుల మంత్రి కుమారస్వామి ఇప్పుడేమంటారు? విశాఖ ఉక్కుపై ఇంకా కేంద్రం మాటలు ఈ రాష్ట్ర ప్రజానీకాన్ని నమ్మమంటారా? విశాఖ ఉక్కునే కాదు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు నియమింపబడ్డ కేంద్ర బలగాలైన సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)ను విశాఖ ఉక్కులో నిర్వీర్యం చేసే కుట్రలు మొదలయ్యాయి. దీంతో కార్మికుల్లో తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రతి నిత్యం ఏదో ఒక కుట్ర వ్యూహంతో కేంద్రం, యాజమాన్యం వ్యవహరిస్తూ ప్రైవేటీకరణ దిశగానే ముందుకెళ్తున్నాయంటూ సాధారణ కార్మికులు మండిపడుతున్నారు.

స్టీల్ మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్

రూ.3లక్షల కోట్ల విలువైన ఉక్కు ఆస్తులను కాజేసేందుకు కేంద్రం చూస్తుందని ప్లాంట్‌లో భవములు, సామగ్రికి రక్షణ కవచంగా ఉండే సిఐఎస్ఎఫ్ సిబ్బందిని కుదించేందుకు యాజమాన్యం చూడడంపై కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి, కార్యాలయ ఉన్నత అధికారులు జోక్యం చేసుకుని ఆపాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తులకు స్టీల్‌ప్లాంట్ భద్రతను అప్పగించే పనిలో యాజమాన్యం నిమగ్నమైందని, ఇదే జరిగితే

మిగతా 2లో..

కె.లోకనాథం

జి.కోటేశ్వరరావు

ఎం.జగ్గునాయుడు

బి.పద్మ

సిపిఎం రాష్ట్ర కమిటీకి ఎన్నిక

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

నెల్లూరులో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు జరిగిన సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలో చివరి రోజు సోమవారం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా కె.లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అనకాపల్లి నుంచి జి.కోటేశ్వరరావు, విశాఖ నుంచి ఎం.జగ్గునాయుడు, బి.పద్మ ఎన్నికయ్యారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- 10 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 11న పరిశీలన, 13న ఉపసంహరణ, 27న పోలింగ్
- కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్కు ఏర్పాటు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ విడుదలచేశారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు ప్రభుత్వ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని, 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 123 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 21,555 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు.

ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రాష్ట్రంలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గాల్లో

మిగతా 2లో..

దుర్వాసనతో విద్యార్థులకు అస్వస్థత

వార్తలు 3లో..

యువ క్రికెటర్ షబ్నమ్ షకీల్‌కు అభినందన

వార్త 4లో..

గీతం విసిగా డాక్టర్ ఎరోల్ డిసౌజా

వార్త 4లో..

తోపుడు బండ్ల కార్మికులపై వేధింపులు ఆపాలి

వార్త 8లో..

ఈ జీతంతో బతికేదెలా?

సమ్మెలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు (ఫైల్ ఫొటో)

- ఎంతకాలం చేసినా పెరగని వేతనాలు
- మరుగుదొడ్డికీ సమయం లెక్కే
- రోగమొచ్చి రాలేకపోతే రూ.500 కోత
- ఇదీ బ్రాండిక్స్‌లో మహిళా వర్కర్ల దుస్థితి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'కటింగ్‌లు చేసుకొని ఇస్తున్న ఎనిమిదివేల జీతంతో మేమెలా బతుకుతాం. మా పిల్లలను ఎలా పెంచుకోవాలి. మా బాధలను అర్ధంచేసుకొని జీతాలు పెంచి న్యాయం చేయాలి.' అని తన ఆవేదనతో పాటు యాజమాన్యాన్ని విజ్ఞప్తిచేసింది ఓ మహిళా ఆపరేటర్. 'రోజుకు ఎనిమిది గంటల డ్యూటీ అయినా రానూపోనూ రవాణా సమయం చూసుకుంటే పధ్నాలుగు నుంచి పదిహేను గంటలు పడుతోంది. నిద్ర ఉండదు. కుటుంబ సభ్యులు, పిల్లలతో గడిపే అవకాశం ఉండదు. పిఎఫ్, ట్రాన్స్‌పోర్టు, క్యాంటిన్ వంటి వాటికి కటింగ్ చేసి చేతికి రూ.9,500 ఇస్తున్నారు' అని వాపోయింది మాడుగుల మండలానికి చెందిన ఓ మహిళా (ఉద్యోగ భద్రత రీత్యా పేర్లు ఇవ్వడంలేదు) వర్కర్. వర్కరెవరైనా, వారెంత దూరం నుంచి వచ్చి వెళ్తున్నా, ఎన్ని సంవత్సరాల నుంచి పనిచేస్తున్నా అచ్యుతాపురం అథిస్తాన్ (బ్రాండిక్స్) సెజ్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులెవరిలోనూ సంతృప్తిలేదు. పీసుల టార్గెట్లు పెంచుతున్నా వారికి జీతం పెంచడంలేదు. ఆరోగ్యం బాగోలేకపోతే సెలవు ఇవ్వడంలేదు. పనిచేయలేని స్థితిలో రాలేని వర్కర్‌కు రోజుకు రూ.500 జీతం నుంచి యాజమాన్యం కట్ చేస్తోంది. వర్కర్‌కు ఒక రోజులో చెల్లించే వేతనం కంటే సెలవు రోజు కోత పెడుతున్న వేతనం ఎక్కువగా ఉంటుంది. మరుగుదొడ్డికి వెళ్లి తొందరగా రాకపోతే భరించలేని

మిగతా 2లో..

రైల్వేలో మౌలిక సదుపాయాల అభివృద్ధి

డిఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ

వార్త 2లో..

Mrs. MARIADAS SCHOOL

Annamma Colony: Sriharipuram: Visakhapatnam - 530011

ADMISSION NOTICE

Application forms for admission to LKG to Std V for the academic year 2025-2026 are being issued from February 04th - 2025 from the School Office, Annamma Colony, Sriharipuram.

CORRESPONDENT

కెజిహెచ్‌లో ఉచితంగా కేన్సర్ వైద్యం

కెజిహెచ్‌లో ఏర్పాటుచేసిన లేనాక్ మెషిన్

రూ.40 కోట్లతో అందుబాటులోకి లేనాక్ మిషన్

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న రోగులకు కింగ్ జార్జ్ ఆసుపత్రి (కెజిహెచ్)లో సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్.పి శివానంద తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎమ్.టి.కృష్ణబాబు, డిఎంఇ నరసింహులు సూచనలు, సలహాలు పాటిస్తూ కెజిహెచ్‌లోని సమగ్ర కేన్సర్ విభాగం ద్వారా మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ విభాగాల్లో రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. గతేడాది కెజిహెచ్‌లో ఈ మూడు విభాగాలకు సంబంధించి భారీగా ఓపి, ఐపి మైనర్, మేజర్ సర్జరీలు జరిగినట్లు చెప్పారు. ముఖ్యంగా మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నాయక్ ఆధ్వర్యాన రోగులకు పూర్తిస్థాయిలో ఖరీదైన వైద్యం ఉచితంగా అందించడంతోపాటు లక్షలాది రూపాయలు విలువగల ఆపరేషన్లు కూడా సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు, ఒడిశా, అండమాన్ నికోబార్ ప్రాంతాల నుంచి కూడా రోగులు తరలివస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో ఏడాదికి 800 వందల మంది వరకు చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రేడియేషన్ అవసరమైన రోగులకు కోబాల్ట్ 60 మిషన్ ద్వారా వైద్యం చేస్తున్నట్లు వివరించారు. ఇకపై రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులో తెచ్చిన రూ.40 కోట్ల విలువ గల లేనాక్ మిషన్ ద్వారా శరీరంలో ఏ ప్రాంతంలో కేన్సర్ కణాలు ఉన్నా గుర్తించి వాటికి సకాలంలో వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ఈ అడ్వాన్స్‌డ్ మిషన్ ద్వారా బ్రెయిన్ ట్యూమర్ వంటి రోగాలను సైతం వారం రోజులు వ్యవధిలోనే పూర్తిస్థాయిలో నయం చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఇదే వైద్య సేవలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని, కెజిహెచ్‌లో మాత్రం పూర్తిగా ఉచితంగానే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ లేనాక్ మిషన్ ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయినప్పటికీ, రోగులకు సేవలు అందించేందుకు మరో మూడు నెలల సమయం పడుతుందని, పూర్తిస్థాయిలో మిషన్ రన్నింగ్‌లోకి వచ్చిన తర్వాత రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నట్లు పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఉక్కును నిలబెట్టే చర్యలేవేనా?

స్టీల్‌ప్లాంట్‌ను హోల్‌సేల్‌గా అమ్మేయడం ఖాయమంటూ ఆందోళన వ్యక్తంచేశారు. సిఐఎస్‌ఎఫ్ భద్రతా వలయంలో ఉన్నందునే స్టీల్‌ప్లాంట్‌కు ఆస్తులకు ఎప్పటికీ నష్టం జరగలేదని, కేంద్రం నుంచి జరుగుతోన్న తాజా కుట్రలతో ప్లాంట్ మనుగడకే ప్రమాదం వాటిల్లుతుందని, తక్షణం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ చర్యలను విడనాడకపోతే పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు.

ఈ జీతంతో బతికేదెలా?

మాట పడాల్సిందేనని మహిళలు వాపోతున్నారు. రుతుస్రావం రోజుల్లో తీవ్ర యాతన పడుతున్నామని దు:ఖం దిగమింగుకుంటూ చెప్పారు ఆ వర్కర్లు. అలవాటుపడి ఈ కంపెనీలో పనిచేస్తున్నారే తప్ప పని ప్రదేశంలో సదుపాయాలు, గౌరవం, జీతంలో సంతోషం వారిలో ఏ మూలా కన్పించడంలేదు. ప్రసూతి కాలంలో ఆరు నెలలపాటు జీతంతో కూడిన సెలవులు ఇవ్వకుండా, పని నుంచి తొలగిస్తున్నారని మహిళా వర్కర్లు చెబుతున్నారు. జీతంతో కూడిన ఆరు నెలల ప్రసూతి సెలవు అమలవుతోందని విసెజ్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమ్య తెలిపారు. చట్ట ప్రకారం ప్రసూతి సెలవులు బ్రాండిక్స్‌లో పనిచేస్తున్న మహిళలకు వర్తిస్తాయని ప్రజాశక్తికి చెప్పారు. ఎంతోకాలం నుంచి తామెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, జీతం పెంచాలని కోరుతున్నా యాజమాన్యం స్పందించకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో సమ్మె చేశామని మహిళలు తెలిపారు.

60వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం నుంచి ఏడాదికి ఎకరాకు రూపాయి చొప్పున వెయ్యి ఎకరాలు శ్రీలంకకు చెందిన బ్రాండిక్స్ యాజమాన్యం పొందింది. 2010లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ(బిఐఎసి) ప్రారంభించారు. కంపెనీ ప్రారంభించి 15 ఏళ్లవుతున్నా వివిధ యూనిట్లలో కలిపి 22వేల మందికి మించి ఉపాధి కల్పించలేకపోయింది. ఉపాధి కల్పించిన వారికి కూడా కనీస వేతనాలు అమలుచేయడంలేదు. సెజ్‌లు వస్తే స్థానికులు ఉపాధి పొందడంతో వారి జీవితాలు మెరుగుపడతాయని పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం వివిధ రూపాల్లో కోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తోంది. కానీ ఆచరణలో నిర్దేశిత ఉపాధి కల్పించకపోగా, కల్పించినా కనీస వేతనాలు అమలుకాని పరిస్థితి పరిశ్రమల్లో నెలకొంది. ఎగుమతి ఆధారిత ఉత్పత్తులతో వేల కోట్లు లాభాలు ఆర్జిస్తున్న బ్రాండిక్స్ యాజమాన్యం పనిచేస్తున్న మహిళా వర్కర్లకు మాత్రం కనీస వేతనాలు, సదుపాయాలు, కార్మిక చట్టాలు అమలుచేయడంలేదు. దీంతో 2016 ఏప్రిల్ 15న బ్రాండిక్స్‌లో మెరుపు సమ్మె ప్రారంభమైంది. తాజాగా జనవరి 30న బ్రాండిక్స్ -2వ యూనిట్, ఫిబ్రవరి 1న 1,3 యూనిట్ల మహిళలు సిఐటియు మద్దతుతో మెరుపు సమ్మె చేశారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఓటరుగా నమోదై ఉండాలి. జనరల్ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్‌గా చెల్లించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. నామినేషన్ ఫారం, ఆస్తులు, అప్పులు, కుటుంబానికి చెందిన సమాచారంతో అఫిడవిట్, ఓటరు వివరాలను సంబంధిత అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి సంతకంతో కూడిన సర్టిఫికెట్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని తెలిపారు. నామినేషన్‌పై ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఉన్న 10 మంది ఓటర్లు బలపరుస్తూ సంతకాలు చేయాలని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి వద్దకు అనుమతించనున్నట్లు వివరించారు. సందేహాలు నివృత్తి, ఇతరత్రా సహాయం కోసం కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేశామని, ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యపద్మ అందుబాటులో ఉంటారని తెలిపారు.

ఓటు కోసం మరో 1,300 దరఖాస్తులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు మరో 1,300 దరఖాస్తులు చేసుకోగా, అవి పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. గత నెల 31వ తేదీ చివర రోజు కావడంతో అప్పటివరకు వచ్చిన ఈ దరఖాస్తులను విచారించేందుకు వీలుగా సంబంధిత జిల్లాలకు పంపినట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 వ తేదీన ఓటరు తుది జాబితా విడుదల అవుతుందని వివరించారు. ప్రస్తుతం జాబితాలో ఉన్న 21,555 మంది ఓటర్లకు వీరు అదనం అని పేర్కొన్నారు.

రైల్వేలో మౌలిక సదుపాయాల అభివృద్ధి

డిఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో రూ.9417 కోట్లు కేటాయింపులు చేయడం ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక పరిణామం అని వాల్తేర్ డిఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ పేర్కొన్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ సోమవారం నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డిఆర్ఎం పలు వివరాలను మీడియాకు వెల్లడించారు. వాల్తేరు డివిజన్‌లోని విజయనగరం, శ్రీకాకుళం రోడ్, సింహాచలం, పార్వతీపురం, నౌపాడ జంక్షన్, అరకు, బొబ్బిలి, చీపురుపల్లి, దువ్వాడ, కొత్తవలస స్టేషన్లను అమృత్ భారత స్టేషన్ల పథకం కింద రూ.800 కోట్లతో చేపట్టిన పునర్నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రూ.500 కోట్లతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వివరించారు. గడిచిన సంవత్సరం 3 వందేభారత్, ఒక అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని విశాఖపట్నం - సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ రైళ్లను 16 కోచ్‌ల నుంచి 20 కోచ్‌లకు పెంచినట్లు చెప్పారు. విశాఖపట్నం - పలాస మధ్య 200 కిలోమీటర్ల ట్రాక్‌ను గంటకు 130 కిలోమీటర్ల వేగంతో, పలాస నుంచి భువనేశ్వర్ మధ్య ఉన్న 100 కిలోమీటర్ల ట్రాక్‌ను గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైలు నడిచేలా ఆధునీకరించినట్లు తెలిపారు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు ఇప్పటివరకు ఎటువంటి కేటాయింపులూ జరగలేదని, ఏమైనా కేటాయింపులు ఉంటే బడ్జెట్ కేటాయింపుల వివరాలు వచ్చిన తర్వాత వెల్లడిస్తామని వివరించారు. రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని 187 సీసీ కెమెరాలను రైల్వే స్టేషన్లో అన్ని ప్రాంతాలు కనిపించే విధంగా ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

'స్టూడెంట్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : శ్రీ సాయి మాతా క్రియేషన్స్ బ్యానర్‌పై పి.సాయిరాం దర్శకత్వంలో స్వయ నిర్మాణంలో నిర్మించిన 'స్టూడెంట్' చిత్రానికి సంబంధించిన పోస్టర్‌ను బీచ్ రోడ్‌లోని గ్రీన్ పార్క్ హోటల్లో హీరో సుమన్ విడుదలచేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, ఒక చక్కని గుర్తుండి పోయే పాత్ర చేసానని, ఆ పాత్ర తనకు చాలా సంతృప్తి నిచ్చిందని తెలిపారు. ఇది విలువలతో కూడిన చిత్రమని, ప్రతీ తల్లిదండ్రులూ, విద్యార్థులూ తిలకించాలని కోరారు. దర్శకుడు సాయిరాం మాట్లాడుతూ, మంచి సందేశాత్మక చిత్రంగా దీన్ని నిర్మించామని చెప్పారు. అందరూ పాత్రకు తగినట్టుగా నటించారని తెలిపారు. ఇందులో సీనియర్ నటులు సుమన్, సుధా, జబర్దస్త్ అప్పారావు, సత్తి పండు, హీరోగా విద్యాసాగర్, ముఖ్య పాత్రలో రవితేజ నటించారని, దీనికి సంగీతం ప్రతాప్ అందించారని తెలిపారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జనవరి 2025 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సులలో ప్రవేశాలకోసం గడువును 2025 ఫిబ్రవరి 15వ తేదీ వరకూ పొడిగించినట్లు ఇగ్నో విశాఖపట్నం శాఖ సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. అన్ని సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనేక రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను ఇగ్నో అందిస్తోందని వెల్లడించారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ https://ignouadmission.samarth.edu.in ద్వారా అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. ఫీజులు ఆన్‌లైన్‌లోనే కట్టాల్సి ఉంటుందని వివరించారు. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సులలో ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు పూర్తి ఫీజు రాయితీ ఉందన్నారు.

పేదలకు వీల్ చైర్లు, కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణశ్రీనివాస్ జన్మదిన వేడుకల సందర్భంగా 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యాన అల్లిపురం నేరెళ్ల కోనేరులోని తన కార్యాలయంలో సోమవారం పేదలకు వీల్ చైర్లు, కుట్టు మిషన్లు ఎమ్మెల్యే ద్వారా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, జనసేన, బిజెపి నాయకులు పి.శివప్రసాద్‌రెడ్డి, సునీల్, మంత్రి శాలివాహన్, ఉమామహేశ్వరరావు, కేదారినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో ఎఎంసి విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రథమ సంవత్సరం విద్యార్థి కె.ఆధవన్ గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 7వ ఏపి స్టేట్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆధవన్‌ను ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు అభినందనలు తెలిపారు. కాలేజీ నుంచి ఆయనకు రూ.5 వేలు నగదు బహుమతి అందజేశారు.

విశాఖలో 'ఈట్ ష్యూర్' రుచులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రీబెల్ ఫుడ్స్ సంస్థ అనేక విశిష్టత కలిగిన బ్రాండ్లతో విశాఖ పరిధి మధురవాడలో తొలిసారి 'ఈట్ ష్యూర్'శాఖను సోమవారం ప్రారంభించారు. తొలిరోజు బహుమతులుగా 40శాతం డిస్కౌంట్‌తో పాటు ఫ్రీ గార్లిక్ బ్రెడ్, సాఫ్టీ, కొన్ని బెవరేజెస్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఈట్ ష్యూర్ సంస్థ కో-ఫౌండర్ సాగర్ కొచ్చర్ మాట్లాడుతూ, ఆహారాన్ని వడ్డించడంలోనూ డిజిటల్ రంగాన్ని వాడుతూ క్యూలో నించోకుండా విందారగించేలా సేవలందించనున్నట్లు తెలిపారు. ఫ్రాంచైజ్ భాగస్వామి విష్ణువర్ధ కలిదిండి మాట్లాడుతూ, విందు తీసుకోవడంలో కొత్త అనుభూతిని కల్పించేందుకే ఈట్ ష్యూర్‌ను ప్రారంభించామన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPTNAM
I.A. No. 500 /2024 In O.S.139/2019

Between:
Vanka Diwakar ... Petitioner
And:
Gobulangi Drakshyani & another ...Respondents

DEFENDANT'S:
1. Doddi Babu Rao S/o Ramulu, Hindu, Aged 37 years, residing at D.No.1-30,Noothalaguntapalem, Narsingabilly Post, Kasimkota Mandalam, Anakapally.

Whereas the above plaintiff has filed the above suit seeking Cancellation of sale deed and such other reliefs. Whereas, it is found to the satisfaction of Honourable court that you have been evading consistently, the receipt of summons/ notice in the above proceedings. Hence the Honourable court was pleased to direct substituted service of summons by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you are hereby directed to appear before the HONOURABLE **PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPTNAM**on **10-02-2025 at 10.30 A.M** either in person or through an Advocate, failing which the hearing will take place in your absence.

(By order of the Hon'ble Court)
S.VINOD KRISHNA & B. SREE BALA
Advocates, Visakhapatnam
Cell : 9959869892

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPTNAM
I.A. No. 501 /2024 In O.S.139/2019

Between:
Vanka Diwakar ... Petitioner
And:
Gobulangi Drakshyani & another ...Respondents

DEFENDANT'S:
1.Gobulangi Drakshyani W/o Venkata Kumar, Hindu, aged about 38 years, House Wife, residing at T-4, Sri Sai Vallabha Enclave, ChadulavariVeedhi, Anakapally, Visakhapatnam.
2. Doddi Babu Rao S/o Ramulu, Hindu, Aged 37 years, residing at D.No.1-30, Noothalaguntapalem, Narsingabilly Post, KasimkotaMandalam, Anakapally.

Whereas the above plaintiff has filed the above suit seeking Cancellation of sale deed and such other reliefs. Whereas, it is found to the satisfaction of Honourable court that you have been evading consistently, the receipt of summons/ notice in the above proceedings. Hence the Honourable court was pleased to direct substituted service of summons by way of publication in this newspaper.

Take notice that in the above proceedings you are hereby directed to appear before the HONOURABLE **PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPTNAM** on **10-02-2025 at 10.30 A.M** either in person or through an Advocate, failing which the hearing will take place in your absence.

(By order of the Hon'ble Court)
S.VINOD KRISHNA & B. SREE BALA
Advocates, Visakhapatnam
Cell : 9959869892

బొగ్గు పొడి నిల్వల గొడౌన్ నిర్మించొద్దు

పోర్టు అధికారుల వద్ద అభ్యంతరం వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి -గాజువాక : షీలానగర్ టోల్‌గేట్ వద్ద విశాఖ పోర్ట్ నిర్మించనున్న బొగ్గు పొడి నిల్వల గొడౌన్‌ను తక్షణమే నిలుపుదల చేయాలని మింది, అక్కిరెడ్డిపాలెం, పంచవటి గ్రామాల ప్రజలు, అఖిలపక్ష పార్టీల నేతలు కోరారు. సోమవారం నిర్మాణాలను పరిశీలనకు వచ్చిన విశాఖపట్నం పోర్ట్ అధికారి శాంతి స్వరూప్‌ను నిలదీసి ప్రశ్నించారు. గ్రీన్ పెట్రోలియం నిల్వల కోసం నిర్మిస్తున్న గొడౌన్లతో భూఉపరితల వాతావరణం దుమ్ము, ధూళిమయం కావడంతోపాటు, భూగర్భ జలాలు కలుషితమైపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ నాయకులు ఎ.లోకేశ్వరరావు మాట్లాడుతూ, గెడ్డలు పూడ్చిగొడౌన్ నిర్మించడం వల్ల భవిష్యత్తులో ముంపు ప్రమాదం తప్పదన్నారు. గొడౌన్ల కోసం గ్రీన్‌బెల్ట్ పూర్తిగా తొలగించారని, ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ప్రశ్నించారు. టిడిపి నేత అనంతలక్ష్మి, వైసిపి నేత లతీష్, పంచవటి వాసులు ఐ.చిన్నారావ్, రామ్మోహనరావు పాల్గొన్నారు.

వికలాంగ పింఛనుదారులకు నేటి నుంచి వైకల్య నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటోజోన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో శారీరక (ఆర్థోపెడికల్) వైకల్యమున్న పింఛనుదారులకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. జోన్ పరిధిలో 526మంది వికలాంగ లబ్ధిదారులుండగా, తొలివిడతలో రోజుకు వంద మంది చొప్పున ఈనెల 4,5,6 తేదీల్లోనూ, మలివిడతలో మిగిలిన 226 మందికి ఈ నెల 11, 12, 13 తేదీల్లో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగ లబ్ధిదారులకు రూ.ఆరు వేలు నెలసరి పింఛను అందజేస్తున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సత్కారం

ప్రజాశక్తి -ఆనందపురం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు స్వీకరించిన స్థానిక కస్తూర్బా విద్యాలయ బయాలజీ టీచర్ పి.ఎస్తేరురాణిని సోమవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చైర్మన్ కోరుకొండ శివాజీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సత్కరించారు. ప్రజా సంకల్ప వేదిక గ్రీవెన్స్ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బొద్దపు బంగార్రాజు, పాఠశాల కమిటీ వైస్‌చైర్మన్ అప్పన్న . కో ఆప్షన్ సభ్యుడు. అక్కిరెడ్డి దేవుడుబాబ పాఠశాల ప్రిన్సిపల్ సత్య లావణ్య గ్రామపెద్ద అప్పలరాజు పాల్గొన్నారు

మహిళా మార్టులో సేంద్రియ కూరగాయలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండల కాంప్లెక్స్ ప్రాంగణంలోని మహిళా మార్ట్‌లో సోమవారం సేంద్రియ కూరగాయల ఉత్పత్తి అమ్మకాలను ప్రాజెక్టు జిల్లా అధికారి మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు కలుషితం లేకుండా ఆరోగ్యకరంగా ఉంటాయని, ప్రతిఒక్కరూ సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సాహించాలన్నారు. మహిళామార్టులో ప్రతిరోజూ తాజా సేంద్రియ కాయగూరలు అందుబాటులో ఉంటాయన్నారు.

స్వచ్ఛందంగా పాఠశాల భవన నిర్మాణం

ప్రజాశక్తి -ఆనందపురం : విశాఖపట్నం రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ. 50లక్షలతో నాలుగు గదుల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. కేశవ మజ్జి, అనికేత వర్మ, మురళి, గన్నమని తదితర దాతలు, సంస్థ సభ్యుల సహకారంతో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఎంఇఒలు వి.జోగేందర్ నాథ్, గంగరాజు, రౌండ్ టేబుల్ సభ్యులు అభిషేక్, చైతన్య, అమిత్ చౌదరి, మక్సూద్ అహ్మద్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం

బడ్జెట్ పత్రాలను చూపుతున్న దళిత సంఘాల నేతలు

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని దళిత హక్కుల పోరాట సమితి, కుల వివక్ష పోరాట సమితి నాయకులు విమర్శించారు. సోమవారం రామ టాకీస్ దరి అంబేద్కర్ భవనంలో మీడియాతో దళిత హక్కుల పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షులు జెవి. ప్రభాకర్ మాట్లాడుతూ దేశజనాభాలో 18శాతం ఉన్న దళితులకు కేంద్ర బడ్జెట్ రూ.50.65లక్షల కోట్లలో రూ.81 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.46 వేల కోట్లు కేటాయించి, రూ. 35 వేల కోట్లు కోతపెట్టారన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.రాజు మాట్లాడుతూ, జాతీయ ఎస్‌సి కమిషన్‌కు గత బడ్జెట్ కేటాయింపులు రూ.71కోట్లు కంటే, రూ.30కోట్లు తగ్గించి, రూ.41కోట్లు కేటాయించడం దారుణమన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ, అంబేద్కర్ విదేశీ విద్యా పథకానికి గత బడ్జెట్‌తో పోలిస్తే రూ.50 కోట్లు తగ్గించడం సరికాదన్నారు. డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి జి రాంబాబు మాట్లాడుతూ, ఎన్‌ఎస్‌ఎఫ్‌డిసికి నిధులు కేటాయింపు లేకపోవడం దుర్మార్గమన్నారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సుబ్బన్న మాట్లాడుతూ, జీవిత బీమా సంస్థలో 100 శాతం ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం కల్పించడం ద్వారా ఆయా సంస్థల్లో ఎస్‌సిల రిజర్వేషన్‌ను అటకెక్కించారన్నారు. దళితుల నిరుద్యోగిత రేటు గత 40ఏళ్లలో సంవత్సరంలో ఎప్పుడూ లేనంతగా పెరిగిందని, స్కిల్‌డెవలప్‌మెంట్ నిధుల్లో దళితులకు ప్రత్యేక వాటా ఇవ్వాలని, సబ్‌ప్లాన్ నిధులను దళితుల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో సవరణలు చేసి, దళితులకు కేటాయింపులు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ సత్యవతి పాల్గొన్నారు

ముడసర్లోవ పార్కులో కాకుల మృత్యువాత

అస్వస్థతకు గురైన కాకి

ప్రజాశక్తి - ఆరిలోవ : ముడసర్లోవ పార్కులో కొన్నాళ్లుగా కాకులు, కొంగలు మృత్యువాత పడుతున్నాయి. రోజుకు మూడు నుంచి నాలుగు కాకులు, కొంగలు మృతి చెందడాన్ని పార్కులో సిబ్బంది గుర్తించారు. సోమవారం కూడా మూడు కాకులు చనిపోగా, మరో రెండు కాకులు అస్వస్థతకు గురై ఎగరలేకపోవడం, అరవక పోవడాన్ని గుర్తించి పశుసంవర్థక శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వెటర్నరీ సిబ్బంది పార్కుకు వచ్చి మృతి చెందిన కాకులతోపాటు అనారోగ్యానికి గురైన వాటిని ల్యాబ్‌కు తీసుకెళ్లారు. అస్వస్థతకు గురైన వాటికి వైద్యం అందించారు. కాగా కాకుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, వాటి మృతికి కారణాలను విశ్లేషించి తగు చర్యలు తీసుకుంటామని వెటర్నరీ ఎడి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. కాగా పార్కులో సందర్శకులు పడేసి, నిల్వ ఉన్న ఆహారపదార్థాలను తినడం వల్ల అస్వస్థతకు గురై మరణించి ఉంటాయని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు.

పురుగులకూ ఒక భాష ఉంటుంది

ఇన్‌సెక్ట్ అకౌస్టిక్స్‌పై అధ్యయనం చేశాం : బెంగళూరు ఐఐఎస్‌సిఐఎస్ ప్రొఫెసర్ రోహిణి బాలకృష్ణన్

ప్రొఫెసర్ రోహిణిని సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : భూమిపైన శబ్దం ద్వారా పరస్పరం సమాచారాన్ని తెలియజేసుకున్న జీవులు పురుగులేనని, దీనిపై పురుగుల శబ్దశాస్త్రం (ఇన్సెక్ట్ అకౌస్టిక్స్) ద్వారా అధ్యయనం చేసినట్లు బెంగుళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సెంటర్ ఫర్ ఎకోలాజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ రోహిణి బాలకృష్ణన్ వెల్లడించారు. సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, జీవశాస్త్ర విభాగంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ,. సంతానోత్పత్తి సమయంలో ఆడ పురుగులను ఆకర్షించడానికి మగ పురుగులు ధ్వని చేయడం ద్వారా సమాచారం పంపుతాయని, ఇవి ఒక్కొక్క జాతి పురుగులో ఒక్కొక్క రకమైన శబ్ద భాష ఉంటుందన్నారు. దట్టమైన అడవులు, ప్రకృతిలో వివిధ జాతుల పురుగుల ధ్వని భాషలను తమ పరిశోధన బృందం రికార్డు చేసి విశ్లేషించిందన్నారు. నెమలి తన రెక్కలు విప్పి ఆకర్షించిన విధంగానే, పురుగుల మధ్య ధ్వని భాష ద్వారా తమ జాతిలోని ఇతర పురుగులను ఆకర్షించేందుకు వివిధ పద్ధతులు పాటిస్తాయన్నారు. గుడ్లు పెట్టడానికి, ఆహారం వెతకడానికి ఒకే జాతి పురుగులు ధ్వని భాష ద్వారా సమాచారం చేరవేసుకుంటాయన్నారు. దీనిపై లోతుగా అధ్యయనం, పరిశోధనలు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను డబ్బులు వాపసు చేయండి

జెడ్‌సికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -మధురవాడ : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జీతాల నుంచి 2016 నుంచి2020 వరకు వసూలు చేసిన ఆదాయపన్ను డబ్బులను వెనక్కి ఇవ్వాలని కోరుతూ జివిఎంసి రెండో జోన్ కమిషనర్ ఫణిరామ్‌కు కార్మికులు వినతిపత్రంఅందజేశారు. జివిఎంసి ప్రజారోగ్య విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులకు 2016లో ఎస్‌ఎల్‌ఎఫ్ ద్వారా జీతాలిచ్చే వారని, అప్పట్లో ఐదేళ్లపాటు నెలసరి వేతనాల నుంచి ఆదాయపు పన్ను కట్‌చేశారన్నారు. ఇది చట్టవిరుద్ధమని సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం చేయగా, కార్మికుల నుంచి వసూలు చేసిన ఆదాయపన్ను డబ్బులను తిరిగి చెల్లించాలని సంబంధిత శాఖ డబ్బులు వెనక్కు ఇచ్చేసిందన్నారు. అయితే రెండో జోన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు ఐటి డబ్బులు ఇంకా వాపసు చేయలేదని, సాంకేతిక సమస్యలుంటే పరిష్కరించి, వెంటనే బ్యాంకు ఖాతాలకు చెల్లింపులు చేయాలని కోరారు. జెడ్‌సికి వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు నేతలు డి.అప్పలరాజు, ఎంవి.ప్రసాద్; సిహెచ్.శేషుబాబు, ఎస్.రామప్పుడు, కె.నాగరాజు, కె.ఈశ్వరరావు, జి.కిరణ్, బి.అప్పారావు, డి.సూరిబాబు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : పుట్టింటికి వెళ్ళిన భార్య తిరిగి కాపురానికి రాలేదన్న మనస్తాపంతో జివిఎంసి నాలుగోవార్డు చేపలుప్పాడ, కొత్తూరు గ్రామానికి చెందిన ఉమ్మిడి నరేంద్ర (31) ఆదివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సిఐ సుధాకర్ కథనం ప్రకారం, చేపలుప్పాడకు చెందిన నరేంద్రకు, తాటితూరు గ్రామానికి చెందిన కొమర లక్ష్మితో గతేడాది ఏప్రిల్ 21న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్ళైన 2 నెలల వరకు సజావుగా సాగిన కాపురంలో తర్వాత దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో పుట్టింటికి వెళ్ళిన భార్య ఎంతకీ రాకపోవడంతో ఆదివారం తల్లి సింహాచలం కూలిపనికి వెళ్లగా, తండ్రి సత్తెయ్య చేపల వేటకు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుని తల్లి సింహాచలం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బి ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మేజర్ పంచాయతీ సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానిక ఎస్ఐ పి.సింహాచలం తెలిపిన వివరాలివి. పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన నారపాడు పూర్ణశేఖర్ (21) ఆదివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం కళ్ళం పాక వద్ద పూర్ణశేఖర్ మృతదేహాన్ని ఆయన తల్లి నాయుడమ్మ గుర్తించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, పరవాడ డిఎస్‌పి వి.విష్ణుస్వరూప్, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. మృతునికి తల్లి నాయుడమ్మ, తండ్రి గోవింద్, అన్నయ్య ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళలు చెందినట్టు సిఐ కుమారస్వామి తెలిపారు. సారిపల్లిపాలెం జంక్షన్ వద్ద ఎలమంచిలి నూకాలమ్మ రోడ్డు దాటుతుండగా విశాఖ నుండి తుని వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఢీకొనడంతో నూకాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ కుమారస్వామి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండల కేంద్రంలోని వైన్ షాప్ నుండి సోమవారం 10 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

దుర్వాసనతో విద్యార్థులకు అస్వస్థత

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- గోపాలపట్నం : గోపాలపట్నం దరి వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తీవ్ర దుర్వాసనతో 11మంది విద్యార్థులు వాంతులై, అస్వస్థతకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. తరగతి గదిలోకి వెళ్లిన వెంటనే దుర్వాసనతో విద్యార్థులు వాంతులు చేసుకోగా, వారిలో 9 మందిని గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మరో ఇద్దరు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడంతో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం కూడా అదే గదిలో దుర్వాసన రావడంతో ఐదుగురు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. సోమవారం పాఠశాలకు వచ్చిన వెంటనే అదే పరిస్థితి పునరావృతం కావడంతో విద్యార్థులు,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తరగతి గదిలో దుర్వాసన, విద్యార్థుల అస్వస్థతకు కారణాలపై పరిశీలిస్తున్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రవి ప్రతాపం

మెడల్ స్వీకరిస్తున్న రవిప్రతాప్

ప్రజాశక్తి- విశాఖపట్నం : జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విశాఖ నగరంలోని పెందుర్తి మండలం పెదగాడి పాఠశాల ఉపాధ్యాయుడు ఎ.రవిప్రతాప్ సత్తా చాటారు. గతనెల 31 నుంచి ఈనెల 3 సోమవారం వరకు కేరళలోని కన్నకులం బాలుర సెకెండరీ స్కూల్ స్పోర్ట్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆరవ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో రవి ప్రతాప్ వంద మీటరల హర్డిల్స్‌లో నాలుగోస్థానం, 200మీటర్ల రన్నింగ్‌లో రజత పతకం సాధించారు. జాతీయస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో దేశంలోని 15 రాష్ట్రాల నుంచి మాస్టర్స్ క్రీడాకారులు పాల్గొన్నారు. గతేడాది హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన జాతీయపోటీల్లోనూ రవిప్రతాప్ స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సాధించారు.

కరాటే విజేతలకు అభినందన

కరాటే విజేతలతో సన్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు సన్ స్కూల్ డైరెక్టర్ కె శ్రీనివాస్ తెలిపారు. 3వ తరగతి విద్యార్థి యువన్ కరాటే, ఫైట్ విభాగాల్లో రెండు బంగారు పతకాలను సాధించగా, మూడో తరగతి విద్యార్థి పూర్ణ చంద్రశేఖర్ కరాటే పోటీల్లో బంగారు, ఫైట్ విభాగంలో వెండి పతకాలు సాధించారు. బాలికల విభాగంలో 5వ తరగతి విద్యార్థిని యశిక కరాటే పోటీల్లో వెండి పతకం సాధించింది. కరాటే పోటీల్లో పతకాలతోపాటు ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులను సోమవారం పాఠశాలలో డైరెక్టర్ శ్రీనివాస్ అభినందించారు.

సిపిఎం రాష్ట్ర నూతన కమిటీకి అభినందన

ప్రజాశక్తి -గాజువాక : నెల్లూరులో జరిగిన సిపిఎం రాష్ట్ర మహాసభలో నిర్వహించిన రాష్ట్ర కమిటీలో కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వి.శ్రీనివాసరావు, ఇతర కమిటీ సభ్యులకు భెల్ సిపిఎం తరపున అభినందనలు తెలిపారు. ఈమేరకు విడుదల చేసిన ప్రకటనలో జిటిపి ప్రకాష్, కె నారపరెడ్డి, ఎస్ జగన్నాధరావు, ఎస్ అప్పారావు, కె.విజయ్‌కుమార్, జి అచ్చన్నాయుడు, పి.కనకరావు, పి.శివరాం శుభాకాంక్షలు తెలిపారు.

విసిసి గాజువాక జోన్ కమిటీ ఎన్నిక

మహాసభలో పాల్గొన్న విసిసి సభ్యులు

ప్రజాశక్తి -గాజువాక :వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) గాజువాక జోన్ మహాసభ సోమవారం సరస్వతి విద్యానికేతన్‌లో నిర్వహించారు. ఒది. ఈ సందర్భంగా కన్వీనర్ బి.అప్పారావు మాట్లాడుతూ, జోన్ పరిధిలో 15 విసిసి క్లబ్‌లు ఉండగా, మూడేళ్లకోసారి నిర్వహించే మహాసభల్లో పిల్లలు, పెద్దలతో కొత్త కమిటీల ఎన్నిక జరుగుతుందన్నారు. గాజువాక మహాసభ ఎనిమిది కమిటీల నుంచి 30మంది హాజరుకాగా, పెద్దల కమిటీ కన్వీనర్‌గా బి.అప్పారావు, కో కన్వీనరుగా ఆర్.స్వర్ణలత, పిల్లల కమిటీ ప్రెసిడెంట్‌గా పి.దుర్గాశ్రావణి, సెక్రటరీగా పి.లావణ్య, వైస్ ప్రెసిడెంట్‌గా సిహెచ్.బాలాజీ, జాయింట్ సెక్రటరీగా నితిన్, సభ్యులుగా మరో ఆరుగురిని ఎన్నుకున్నారు.

సొంత గృహాలున్నా..అద్దింట్లోనే నివాసం!

- ఇళ్లు కేటాయించకున్నా.. తప్పవి ఇఎంఐల వాత
- భానోజీతోట టిడ్కో గృహ లబ్ధిదారుల పరిస్థితి

భానోజీతోటలో మూడేళ్లుగా ప్రారంభానికి నోచని టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి -గాజువాక : టిడ్కో గృహనిర్మాణ పథకంలో తమకు ఇళ్లు మంజూరైనా, వాటిని కేటాయించకపోవడంతో సొంతిల్లు ఉన్నప్పటికీ అద్దింట్లో నివాసముండక తప్పడం లేదని భానోజీతోట టిడ్కో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు తమకు మంజూరుచేసిన ఇళ్లకు సంబంధించి బ్యాంకు రుణాలు, నెలసరి వాయిదాల చెల్లింపుల బెడద తప్పడంలేదని వాపోతున్నారు .ఇటు ఇళ్లులేక, అటు అద్దెలు, ఇఎంఐల చెల్లింపులతో జీవనం కష్టంగా ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతైనా తమకు ఇళ్లు కేటాయిస్తారని భావించినా, తాత్సారం జరుగుతుండడంపై తల్లడిల్లుతున్నారు.

జివిఎంసి 65వ వార్డు భానోజీ తోటలో 2018లో 360 మందికి టిడ్కో ఇళ్లను కేటాయించారు. అందులో ఎ,బి,సి మూడు బ్లాకులుగా 300, 365, 430 చదరపు అడుగుల ప్లాట్‌లుగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయి, మూడేళ్లు గడుస్తున్నా తమకు ఇళ్ల కేటాయించలేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్లాట్‌ల విస్తీర్ణం బట్టి 'ఎ' బ్లాక్ ఇళ్లకు రూ.500, బి బ్లాక్‌కు రూ.50వేలు, సి బ్లాక్‌కు రూ.లక్ష డిపాజిట్ చెల్లించిన లబ్ధిదారులకు, 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఇంటి నిర్మాణానికి సంబంధించి, లబ్ధిదారుడు, ప్రభుత్వ వాటా పోగా మిగిలిన రూ.3.68లక్షలకు 2022లో బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేశారు.

ఇళ్ల కేటాయింపులు, రిజిస్ట్రేషన్ జరగడంతోపాటు బ్యాంకు రుణాలు కూడా మంజూరు అయినప్పటికీ, లబ్ధిదారుల నివాసానికి ఇళ్లను మాత్రం నేటికీ ఇవ్వలేదు. అయినప్పటికీ గత ఏడాదిగా ప్రతినెలా బ్యాంకు మంజూరు చేసిన ఇంటి రుణానికి నెలసరి వాయిదాలుగా రూ.నాలుగు వేలు చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు. ఇళ్లు ఇచ్చారన్న మాటేగాని, అందులో ఉండే పరిస్థితి లేకపోవడంతో బయట అద్దింట్లో నివాసముంటూ, అటు నెలసరి అద్దెలు, బ్యాంకు రుణానికి ఇఎంఐలు చెల్లించక తప్పడం లేదు. దీంతో పలువురు లబ్ధిదారులు ప్రతినెలా డబ్బులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం టిడ్కో లబ్ధిదారుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని, వారికి ఇంటి తాళాలు ఇవ్వాలని కోరుతున్నారు. అంతేకాక టిడ్కో గృహ సముదాయంలో రోడ్లు, డ్రైనేజీ,తాగునీరు, ఇతరత్రా సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు. నిర్మాణం పూర్తయి మూడేళ్ల గడచినా వినియోగంలో లేకపోవడంతో టిడ్కో గృహసముదాయంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, కొన్ని ఇళ్లలో చెదలు పట్టే పరిస్థితి కూడా ఉందని లబ్ధిదారులు అంటున్నారు. ఇళ్లల్లోని విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయని అంటున్నారు. చీకటి అంధకారముందే శిథిలమయ్యే పరిస్థితి కల్పించకుండా, వెంటనే టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతున్నారు.

సౌకర్యాలన్నీ కల్పించి త్వరలో గృహ ప్రవేశాలు

సమస్య నా దృష్టిలో ఉంది. టిడ్కో గృహసముదాయంలో మౌలిక సౌకర్యాలన్నీ నివాస యోగ్యంగా మార్చి లబ్దిదారులకు కేటాయింపులు జరిపి, త్వరలోనే గృహ ప్రవేశాలు జరిపిస్తాం.

– పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, గాజువాక

12 నెలలుగా ఇఎంఐ చెల్లిస్తున్నాం

2018లో టిడ్కో ఇళ్ల కేటాయించారు. 2022 బ్యాంకు రుణాలు మంజూరు చేశారు. ఏడాదిగా ప్రతినెలా బ్యాంకులకు అసలు, వడ్డీలతో కూడిన వాయిదాలను ఇఎంఐగా చెల్లిస్తున్నాం. మంజూరైన ఇళ్ల కేటాయించక, అటు నెలసరి వాయిదాలు, నివాసముంటున్న ఇళ్లకు అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నాం.

– డి రమాదేవి, టిడ్కో లబ్ధిదారు

కాళ్లరిగేలా తిరుగుతున్నాం

టిడ్కో ఇళ్లు మంజూరైందన్న ఆనందం లేకుండా చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి, ఇళ్లు కేటాయించాలని కాళ్లరిగేలా తిరుగుతున్నాం. గత, ప్రస్తుత ప్రభుత్వాలేవీ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి.

– ఎస్.లక్ష్మీనారాయణమ్మ, లబ్ధిదారు

యువ క్రికెటర్ షబ్నమ్ షకీల్‌కు అభినందన

షబ్నమ్‌ను అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

ప్రజాశక్తి -కరాస: క్రికెట్ ద్వారా విశాఖ నగరకీర్తిని పలువురు స్థానిక క్రీడాకారులు విశ్వవిఖ్యాతం చేయడం ఆనందంగా ఉందని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. నగరం నుంచి భారత క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రికెటర్ల సంఖ్య గణనీయంగా పెరగడంపై హర్షం వెలిబుచ్చారు. సోమవారం తన నివాసంలో ఇటీవల విశ్వవిజేతగా నిలిచిన అండర్ -19 వరల్డ్‌కప్ జట్టులోని సభ్యురాలైన విశాఖ 52వ వార్డుకు చెందిన షబ్నమ్ షకీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రెండోసారి భారత్‌కు ప్రపంచకప్ అందించిన అండర్-19 క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. జట్టులో విజయంలో కీలకపాత్ర పోషించిన తెలుగుతేజం షబ్నమ్ షకీల్‌కు అభినందనలు తెలిపారు. ప్రపంచకప్ పోటీలకు వెళ్లేముందు షబ్నమ్‌ను తాను సత్కరించిన సందర్భాన్ని శ్రీధర్ గుర్తు చేశారు. ను ఆయన ప్రత్యక్షంగా అభినందించారు.ఈ సందర్భంగా ప్రపంచకప్ కు వెళ్లే ముందు షబ్నమ్ ను తన నివాసంలో కలిసి సత్కరించిన క్షణాలను శ్రీధర్ గుర్తు చేసుకున్నారు. ప్రపంచకప్ గెలుచుకున్న రెండుసందర్భాల్లోనూ షబ్నమ్ భారత జట్టును జగజ్జేతగా నిలపడంతో కీలకభూమిక పోషించిం దని, ఆమెకు ప్రోత్సాహమిచ్చి, సహకరించిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్, కోచింగ్ బృందానికి శ్రీధర్ అభినందనలు తెలిపారు.షబ్నమ్‌ను ఆటల్లో ప్రోత్సాహిం చిన ఆమె తండ్రి షకీల్‌ను శ్రీధర్ అభినందించారు.

కాంట్రాక్ట్ కార్మికులను తొలగించొద్దు

స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ధర్నా : హెచ్‌ఒడిలకు వినతి

హెచ్‌ఒడికి వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

ప్రజాశక్తి -ఉక్కునగరం :స్టీల్ కాంట్రాక్టు కార్మికుల తొలగింపును తక్షణం ఆపకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. సోమవారం కోక్ ఓవెన్ ఆర్ఎంహెచ్‌పి. టిపిపి సింటర్ ప్లాంట్ హెచ్ఒడి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ ఎవ్వరినీ తొలగించబోమని అక్టోబరు 2న ఆర్ఎల్‌సి సమక్షంలో అంగీకరించి, ఇప్పుడు దొడ్డిదారిన కాంట్రాక్టు కార్మికులను తొలగించే యత్నాలు చేస్తున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికి రావద్దని, స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తే దానికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి శ్రీనివాసరావు, మంత్రి రవి, కోన రమణ, ఉమ్మడి అప్పారావు, యు సోమేష్, పి మసేను, సోంబాబు, శశిభూషణ్, నాగరాజు, కోన అప్పారావు, మంగరాజు, పితాని భాస్కరరావు పాల్గొన్నారు

చిన్నారులకు అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలం నీళ్లకుండీలు దరి సాయి స్వామివివేకానంద పాఠశాలలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. సరస్వతీదేవికి, భారతమాతకు పూజలు, యజ్ఞం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ లెంక సురేష్, పాఠశాల డైరెక్టర్స్ కొట్రా శర్మ, చవితిన వీరుబాబు, యమరాణి, సురేష్ పాల్గొన్నారు.

గీతం విసిగా డాక్టర్ ఎరోల్ డిసౌజా

డాక్టర్ ఎరోల్ డిసౌజా

ప్రజాశక్తి -మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్‌గా ఐఐఎమ్, అహ్మదాబాద్ విశ్రాంతి డైరక్టర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్థిక శాస్త్రంలో నిపుణులైన డాక్టర్ డిసౌజా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా, నేషనల్ హౌసింగ్ బ్యాంక్, భారత ప్రణాళికా సంఘం, నీతి అయోగ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీలకు సలహాదారుగా వ్యవహరించారు. ప్యారిస్‌లోని సైన్సెస్ పో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్‌గా, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ సీనియర్ ఫెలోగా, సిమ్లాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్టడీ విజిటింగ్ ప్రొఫెసర్‌గా, కొలంబియా విశ్వవిద్యాలయం విజిటింగ్ స్కాలర్‌గా సేవలందించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసిఎస్ఎస్ఆర్) నిపుణుల కమిటీలలో సభ్యుడిగా ఉన్నారు. ఇండియన్ జర్నల్ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్, క్వాంటిటేటివ్ ఎకనామిక్స్ జర్నల్‌ల సంపాదకవర్గం సభ్యుడుగా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్ డిసౌజా నియామకం పట్ల గీతం సలహాదారు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ అభినందనలు తెలిపారు.

విఎమ్ఆర్‌డిఎ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి, సబ్బవరం

విశాఖ మెట్రోపాలిటన్ రీజినల్ అభివృద్ధి అథారిటీ ద్వారా చేస్తున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విఎంఆర్‌డిఎ కమిషనరు కెఎస్.విశ్వనాధన్‌తో కలిసి సోమవారం ఆమె అనకాపల్లి జిల్లా అంతకాపల్లి, సిరసపల్లి, బాటజంగాలపాలెం ప్రాంతాలలో అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు. జిల్లాలో విఎంఆర్‌డిఎ ద్వారా చేపడుతున్న కొడూరు నుంచి అనకపల్లి ప్రణాళికా రహదారి, అనకాపల్లి రావుగోపాలరావు ఆడిటోరియం ఆధునికీకరణ, సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టబోతున్న కొత్తూరు ఉద్యానవనం పనులు, తుమ్మపాలలో నిర్మించ తలపెట్టిన కన్వెన్షన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్ తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ముందుగా విఎంఆర్‌డిఎ కమిషనరు విశ్వనాధన్ వేపగుంట నుంచి పినగాడి వరకు 150 అడుగుల మేర విస్తరించ తలపెట్టిన ప్రణాళికా రహదారిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్వేశాఖ సహాయ సంచాలకులు గోపాలరాజు, విఎంఆర్‌డిఎ ముఖ్య ప్రణాళికా అధికారి శిల్పా, ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, ఎల్ఎఎ వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్ రాంబాబు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్, సహాయక ఇంజనీర్ నాయుడు, ప్రణాళికా విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్, విఎంఆర్‌డిఎ కమిషనర్

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థినులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ

చోడవరం బాలికోన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన 1989-1992 బ్యాచ్ విద్యార్థులు సోమవారం పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా వచ్చి తాము చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తాము ఉన్నతంగా ఎదుగుటకు కావలసిన ప్రాథమిక స్థాయి విద్యతో పాటు మంచి నడవడిని నేర్పించిన ఉపాధ్యాయులు కమలా, నవ మాలినీ, సుందరి, మంగ కుమారి, గాయత్రి, విజయలక్ష్మిలను స్వయంగా కలుసుకుని తరగతి గదులలో జరిగిన అప్పటి ముచ్చట్లను పంచుకున్నారు. వారిని గౌరవంగా సన్మానించారు. పేరు పేరున అందరిని అడిగి వివరాలు తెలుసుకుని ఉపాధ్యాయులు అమితానందం పొందారు. తాము చదుకున్న రోజులలో చేసిన మంచి పనులను, చిలిపి పనులను తలచుకుని నవ్వుకున్నారు. తమ తరగతి గదులలోకి వెళ్లి తాము కూర్చున్న బెంచీలపైన కూర్చొని మధురానుభూతిని పొందారు. ఇలా కలుసుకోవడానికి కృషి చేసిన మిత్రులు రేవతి, కృష్ణవేణి, భవాని, ధనలక్ష్మి సువర్చలా, సుజాతలను అభినందించారు. ఈ సమ్మేళనానికి సహకరించిన పాఠశాల ప్రస్తుత ప్రిన్సిపాల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

హత్య కేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన ఓబలరెడ్డి నరసమ్మ (58) అనే మహిళను జనవరి 9వ తేదీన హత్య చేసిన నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. చోడవరం పోలీస్ స్టేషన్లో సోమవారం ఎస్‌పి కేసు వివరాలను వెల్లడించారు. నరసమ్మ దగ్గర ఉన్న బంగారం కోసం ఆమెను హత్య చేసి మూడు తులాలున్నర బంగారాన్ని నిందితుడు ఎత్తుకెళ్లినట్లు గుర్తించామన్నారు. నిందితుడు విజయనగరం జిల్లా కొత్తవలస ముత్తూట్ బ్యాంకులో బంగారాన్ని రూ.1,85 లక్షలకు తాకట్టు పెట్టి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు వెళ్లిననట్లు పేర్కొన్నారు. ఫోన్ కాల్ డేటా, సీసీ ఫుటేజీల ద్వారా గురించి చోడవరం మండలం గజపతి నగరం వద్ద నిందితున్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు గతంలో విజయనగరం జిల్లాలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్టు చెప్పారు. ఈ కేసును ఛేదించిన చోడవరం సీఐ అప్పలరాజు, ఎస్సైలు నాగ కార్తీక్, జోగారావు, హెడ్ కానిస్టేబుల్ బంగార్రాజు, పోలీసులు పి నానాజీ, నాగదేవి, హోం గార్డులు బాలాజీ నాయుడు, పి బాలాజీ, బివి ప్రసాద్, టి శ్రీను తదితరులను ఎస్‌పి అభినందించి ప్రశంస పత్రాలు నగదు బహుమతులు అందజేశారు.

పాడి పశువుల పట్ల జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పాడి పశువుల పట్ల జాగ్రత్తలు వహించాలని హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె.శేషు రైతులకు సూచించారు. మండలంలోని తమ్మయ్యపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశు వైద్య డాక్టర్ ఎం హేమ సుందర్ పశువులను పరీక్షించారు. 30 పాడి పశువులకు డి వార్మింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, బి అప్పారావు ఎం దుర్గాప్రసాద్ ఈ అప్పలరాజు ఎం చిన్నారావు ఈ పెంటారావు విజయలక్ష్మి వెంకట్రావు దేవి శ్రీను పాల్గొన్నారు.

నెలాఖరుకు లైఫ్ సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి సబ్ ట్రెజరీ పరిధిలోని పెన్షన్‌దారులంతా తమ లైఫ్ సర్టిఫికెట్లు ఫిబ్రవరి నెలాఖరు నాటికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్థానిక ఉప ఖజానీ కార్యాలయాధికారి టి.ఉదయ భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి 28 ఫిబ్రవరి లోపు ఆన్‌లైన్ ద్వారా గాని, స్వయంగా గాని పోస్టాఫీస్‌లో లేదా ఇంటర్‌నెట్ ద్వారా గాని పెన్షన్‌దారులు తమ లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించాలని, అదే సమయంలో ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తీసుకువచ్చి సర్టిఫికేట్‌ను రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు చెందిన పెన్షన్‌దారులంతా తమ పరిధిలోకి వస్తారని, ఈ మూడు మండలాల్లో మొత్తం 1,156 మంది ఉన్నారని తెలిపారు. వయసు మీరిన, అనారోగ్యం పాలైన పెన్షన్ దారులు వివరాలు తెలియజేస్తే సబ్ ట్రెజరీ అధికార్లే స్వయంగా పెన్షన్ దార్ల ఇంటికి వెళ్లి ఐకెవైసి ద్వారా సర్టిఫికెట్ రిజిస్టర్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

'సాయినార్ లైఫ్ సైన్సెస్' మూసివేతపై చర్యలు

యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్‌కు ప్రభుత్వ అనుమతి

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ జెఎన్ ఫార్మసిటీలోని సాయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు రాష్ట్ర లేబర్ కమిషనర్ వారికి అనుమతిస్తూ జిఒఆర్‌టి నెంబర్ 37 విడుదల చేసింది. సాయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ ఆక్ట్ 1947, సెక్షన్ 38, రెడ్ విత్ సెక్షన్ 34, సబ్ సెక్షన్ 1 ఉల్లంగించి కంపెనీని ముందస్తుగా ప్రభుత్వ అనుమతి లేకుండానే మూసివేయడంతో వందలాది మంది కార్మికులు వీధిన పడ్డారు. దీనిపై అవ్వారి శ్రీకృష్ణ, ఇతర ఉద్యోగులు సాయినాథ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వ్యతిరేకంగా విశాఖపట్నం జాయింట్ లేబర్ కమిషనర్ వారిని ఆశ్రయించారు. దీంతో ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్ 1947, అండర్ రూల్ 78బి ఆఫ్ ఏపీ ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ రూల్స్ 1958 ప్రకారం సాయినాథ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు సాయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేయాల్సిందిగా రాష్ట్ర లేబర్ కమిషనర్ విశాఖ జాయింట్ లేబర్ కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయంపై నిరసన

బడ్జెట్ పత్రల దహనం

ప్రజాశక్తి-కశింకోట : కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన తాళ్లపాలెం జాతీయ రహదారి వద్ద సోమవారం బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్, బడా పారిశ్రామికవేత్తలకు, సంపన్నులకు అనుకూలంగా ఉందని, సామాన్యులకు ఎటువంటి ప్రయోజనం లేదని తెలిపారు. ఇది ప్రజా, రైతు వ్యతిరేక బడ్జెట్ అని పేర్కొన్నారు. రాజధాని అమరావతి, కడప ఉక్కు ఫ్యాక్టరీ, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి గనుల కేటాయింపు వంటి అంశాలపై ఊసే లేదన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, ఇతర విభజన హామీలపై ఎటువంటి ప్రకటన చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను అధికార పార్టీ, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు నిరసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వి. బెన్నయ్య, బలరాం, బి.నూకరాజు, గోవిందా, బి.అప్పారావు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నేతలు

'కేజ్రీవాల్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదు'

ప్రజాశక్తి-అనకాపల్లి : విలువలకు నిజాయితీకి మారుపేరుగా, మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని ఎదిరిస్తున్న ఆప్ అధినేత కేజ్రీవాల్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదని ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అవినీతి కేసులో జైలుకు వెళ్లి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతో చేతులు కలిపిన వారి కాళ్లు పట్టుకొని బయటకు వచ్చి కూటమిగా పోటీ చేసి గట్టెక్కిన చంద్రబాబు కేజ్రీవాల్‌ను విమర్శించడం తగదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు గురిచేసినా మొండి ధైర్యంతో పట్టుదలగా పోరాడి న్యాయస్థానంలో పోరాడి నిర్దోషిగా బయటకు వచ్చిన కేజ్రీవాల్‌ను ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో విమర్శించడం విచిత్రంగా ఉందన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు ఐక్యంగా కృషి

ప్రజాశక్తి-దేవరాపల్లి : అంబేద్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా దళితులంతా ఒక తాటిపై కొచ్చి కలిసి పని చేస్తామని మండల దళిత సంఘాల ఐక్యవేదిక నేతలు ప్రకటించారు. మండల స్థాయి దళిత సంఘాల ఐక్యవేదిక సమావేశం స్థానిక శ్రీసన్యాసమ్మ ఆలయం వద్ద సోమవారం జరిగింది. మండల నాయకులు కాటపల్లి అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణగారిన వర్గాలను అణిచివేసే కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. గ్రామాలలో వివిధ శాఖలుగా ఉన్న దళిత సంఘాలు అన్నీ కలిసి మండల అంబేద్కర్ ఆశయ సాధన సమితిగా ఆవిర్భవించినట్లు చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సమన్వయకర్తగా సబ్బవరపు మాలిబాబు, గౌరవ అధ్యక్షులుగా కార్లి సాయి సుందరరావు, అధ్యక్షులుగా కాటపల్లి అప్పారావు, ఉపాధ్యక్షులుగా దువ్వాడ రమేష్, ప్రధాన కార్యదర్శిగా పతివాడ నాగభూషణం, సహాయ కార్యదర్శిగా తాడి అప్పారావు, కోశాధికారిగా కంచిమూల అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మచ్చ రామారావుతో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అబాకస్ పోటీల్లో శ్రీగాయత్రి విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన శ్రీగాయత్రి పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి ఎడి పాఠశాలలో విశ్వం ఎడ్యుటెక్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో కశింకోట మండలం తాళ్లపాలెం శ్రీగాయత్రి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన కె.జోషిత్ (3వ తరగతి), జి.జీవన్ కుమార్ (5వ తరగతి) ప్రథమ స్థానంలో నిలిచి ఈ నెల 9న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారిని పాఠశాల యాజమాన్య సభ్యులు బి.అప్పారావు, కరస్పాండెంట్ బి.రామ్‌కుమార్, హెచ్ఎం వై.నగేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

అక్షర స్కూల్ విద్యార్థి ప్రతిభ

వడ్డాది : జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో వడ్డాది అక్షర స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన చల్లా మణికంఠ ప్రథమ బహుమతి పొందారు. ఈ మేరకు మణికంఠను అక్షర స్కూల్ కరస్పాండెంట్ వరప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభ చూపిన అక్షర స్కూల్ విద్యార్థులు

విశాఖ డెయిరీ విధానాలు పాటి రైతులకు శాపం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విశాఖ డెయిరీ చేపడుతున్న నూతన విధానాలు పాడి రైతుల పాలిట శాపంగా మారాయని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాల సంఘాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాడి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాల ధర తగ్గింపు, పాల సేకరణ తగ్గించడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. ప్రైవేటు డెయిరీలకు మించి సేవలందించే విశాఖ డెయిరీ నేడు వాటికంటే సేవలు అందించడంలో వెనుకపడుతుందని పేర్కొన్నారు.

ఫార్మా సిటీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

ఫార్మా ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మసిటీ క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్ పో (ఎగ్జిబిషన్) సోమవారం ప్రారంభమైంది. జెఎన్‌సిపి మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెట్టి సుబ్బారావు, జేఎన్పీసీఎం వైస్ ప్రెసిడెంట్ ఎన్.సూర్యప్రకాష్, ఎంఎఎస్ఆర్ఎమ్ ప్రెసిడెంట్ ఎం.శివరామ ప్రసాద్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్ఎస్.రావు, విశాఖ ఫార్మాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పిపి.లాల్‌క్రిష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి దీనిని ప్రారంభించారు. మీడియా ప్రైవేట్ లిమిటెడ్- ముంబై వారు ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్లో మొత్తం 132 కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు ఎగ్జిబిషన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అజిత్ కుమార్ శుక్ల చెప్పారు. రెండువేల కొత్త ప్రోడక్ట్లను ప్రదర్శించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఫార్మా సంస్థల యాజమాన్యాలు, పరవాడ, అచ్యుతాపురం, నక్కపల్లి, పైడి భీమవరం ఫార్మాలలో పనిచేస్తున్న 50 వేల మంది ఉద్యోగులు, అనుబంధ నిపుణులు పాల్గొన్నారు.

60 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి-కశింకోట : విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కశింకోట సంఘం కార్యాలయంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వారు ఈ శిబిరంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేశారు. ఎనిమిది మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. 17 మందికి కళ్ళద్దాలు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రుచిత, మేనేజర్ చంద్రశేఖర్, సంఘం అధ్యక్షులు పాము సూర్యనారాయణ, కార్యదర్శి కొలచిన కామేశ్వరరావు, కోశాధికారి కానూరి గోపాలరావు, సహాయ కార్యదర్శి నంబా రమణ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : రోడ్డు సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విశాఖ నెహ్రూ యువ సంఘటన, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన రోడ్డు భద్రత, ప్రమాదాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎస్పి పి.సింహాచలం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రోడ్డు సేఫ్టీ విధానాలను గ్రహించాలని, లైసెన్స్ కలిగిన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ సంఘటన ప్రతినిధి కే లీలా ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ డాక్టర్ గణేష్ లెక్కల పాల్గొన్నారు.

'ఉద్యమాలు చేసే అర్హత జగన్‌కు లేదు'

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చెల్లించలేదని ఈ నెల 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి పోరుబాటకు పిలుపునిచ్చే అర్హత జగన్ రెడ్డికి లేదని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఫిబ్రవరి నెలలో బటన్ నొక్కే కార్యక్రమం ఉన్నప్పటికీ చెల్లించలేదని గుర్తు చేశారు. ఆ నెలలోనే రూ.46 వేల కోట్లు ఎఫ్ఆర్‌బిఎంకు లోబడి అప్పులు చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ 3600 కోట్లు బకాయిలు చెల్లించకుండా వైసిపి కాంట్రాక్టులకు, దళారులకు చెల్లించారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నేత కాండ్రేగుల సత్యనారాయణ, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు దొడ్డి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ నేతల అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవను అరెస్టు చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా సమితి అధ్యక్ష కార్యదర్శులు బాబ్జి, ఫణీంద్ర తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏఐఎస్ఎఫ్ నాయకులను అడిగి అడిగి మరీ వినతి పత్రాలు ఇప్పించుకున్నారని, అధికారం చేపట్టిన తరువాత అహంకారం నెత్తినెక్కి కూర్చున్నట్టు ఉన్నాయని విమర్శించారు. అరెస్టు చేసిన కార్యదర్శి మాధవని విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామన్నారు,. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జగదీష్, సింహాద్రి పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలపై

రాష్ట్రపతికి రిజిస్టర్డ్ పోస్టు ద్వారా వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అఖిల భారత అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ (సిఐటియు) పిలుపు మేరకు అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, రెగ్యులర్జేషన్ అమలు చేయాలని కోరుతూ సోమవారం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకి రిజిస్ట్రార్ పోస్ట్ ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ మేరకు వినతి పత్రాన్ని స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నాగ శేషు మాట్లాడుతూ ఫిబ్రవరి 3, 4 తేదీలలో భారత దేశంలో ఉన్న అన్ని అంగన్వాడి సెంటర్ల నుంచి వర్కరు, హెల్పర్, మినీ వర్కురు రాష్ట్రపతికి వినతి పత్రం రిజిస్టర్ పోస్ట్ చేసినట్లు చెప్పారు. ఐసిడిఎస్ స్కీము స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ స్కీంని సంస్థాగతం చేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గుజరాత్ హైకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్వాడి వర్కర్లను, హెల్పర్లను, మినీలను గ్రేడ్ 3, గ్రేడ్ 4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఆ తీర్పు ప్రకారం 7పే కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.26 వేలు చొప్పున రెగ్యులైజేషన్ బకాయిలు చెల్లించాలని కోరారు. సుప్రీంకోరు ఆదేశాల ప్రకారం అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీలు అందరికీ వడ్డీతో సహా గ్రాట్యూటీ చెల్లించాలని, 6 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన పిల్లలు అందరికీ శిశు సంరక్షణ, విద్య, అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందుకు సరిపడా నిధులకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.దుర్గ రాణి, రామలక్ష్మి, బావని, తనూజ, రమణి, సత్యవేని, జానకి, మంగ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రాలు చూపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

బ్రాండిక్స్ కార్మికులకు వేతనాలు పెంచాలి

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన

నిరసన తెలుపుతున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం అచ్యుతాపురం జంక్షన్‌లో నిరనస తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె సోమనాయుడు మాట్లాడుతూ బ్రాండిక్స్ కార్మికులకు కటింగులు పోయి రూ.15వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న మహిళలకు అండగా నిలిచిన సిఐటియు నాయకుల అక్రమ అరెస్టులు చేసి, నిర్బంధ చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. తిమ్మరాజుపేట, మోసయ్యపేట, భోగాపురం, పూడిమడక గ్రామాలలో సిఐటియు నాయకుల ఇళ్ల వద్ద పోలీసులు తిరిగి నాయకులను బెదిరించి నిర్బంధంలో తీసుకొని భయానక వాతావరణ సృష్టించడం అన్యాయమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో చింతకాయల శివాజీ, చందక రామకృష్ణ, ఆర్.లక్ష్మి, ధూళి వెంక నాయుడు, ఒడిసెల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో దొంగతనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా నిర్మించిన టిడ్కో గృహాల్లో జరుగుతున్న దొంగతనాలు, ఆకతాయి చేష్టలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం ఆధ్వర్యంలో బాధితులు సోమవారం పరవాడ సీఐ మల్లికార్జునరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ టిడ్కో గృహాలు పొందిన వారు ఆ గృహాల్లో ఉండకుండా బ్యాచిలర్‌లకు అద్దెకు ఇచ్చారని తెలిపారు. ఆ బ్యాచిలర్ యువకులు రాత్రి సమయంలో మద్యం, గంజాయి తాగి వచ్చి చుట్టుపక్కల ఉన్న ఇండ్ల తలుపులు గుద్ది ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సొంతింటిలో ఉన్న వారిపై గొడవలకు వెళ్లడం, దొంగతనాలకు పాల్పడడం, తాళాలు వేసి ఉన్న ఇళ్ల తాళాలు పగలగొట్టి విలువైన సామాన్లు బట్టలు, బంగారం, డబ్బులు దొంగిలించడం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే గృహాలు అద్దెకిచ్చిన వారిపైనా, దొంగతనాలకు పాల్పడుతున్న యువకులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఎస్ సూరమ్మ, దరిమిరెడ్డి లక్ష్మి, శాంతి, ఎం పర్వతమ్మ, కృష్ణవేణి, ఇందుమతి, బంగారమ్మ, టి.గౌరీ, సిహెచ్.ధన, యు రాణి, డి.వరలక్ష్మి పాల్గొన్నారు.

సిఐకి వినతిపత్రం ఇస్తున్న ఐద్వా నేతలు, బాధిత మహిళలు

కోలాటం గురువుకు తెలుగు వెలుగు నంది అవార్డు

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన కోలాటం గురువు పచ్చికోరు వెంకట వరలక్ష్మికి నంది-2025 అవార్డు లభించింది. వెంకటలక్ష్మి ఎపి, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల దేవాలయాల్లో కోలాటం చేసినందుకు గాను తెలుగు వెలుగు సాహితీ వేదిక గుర్తించి ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ వార్డును ప్రముఖులు చేతులు మీదుగా ప్రదానం చేసింది. తెలుగు వెలుగు నంది-2025 పురస్కారం వెంకట వరలక్ష్మికి రావడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

మహా కుంభాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా శతజయంతి సహిత మహా కుంభాభిషేక మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 4న ఆలయ మంటపంలో విఘ్నేశ్వర పూజ సూర్య నమస్కారాలు, ఉత్సవ ప్రారంభం నీరాజుల మంత్రపుష్పం జరుగుతాయని, సాయంత్రం వెండి రథంపై నగర తిరువీధుల్లో మేళతాళాలతో కోలాటాలతో అమ్మవారు ఊరేగింపు శోభయాత్ర జరుగుతుందని చెప్పారు. ఈ నెల 5 నుండి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ గ్రంధి శేషు కుమార్, బిళ్ళపాటి కృష్ణ కుమార్, కొరుపోలు, శ్రీధరాల సోమరాజు, వుప్పల రవి రామ్ జవహర్, గ్రంధి వివియుఎస్,మాణిక్యం, వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు సర్వం సిద్ధం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి గొల్లలకొండపై సూర్యదేవుని ఆలయంలో మంగళవారం 'రథసప్తమి' వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుండే పూజలు ప్రారంభమౌతాయని, తప్పెటగుళ్లు, కోలాటాలు, చిడతలు, నేలవేషాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తిమిరాం గ్రామంలో రథసప్తమి సందర్భంగా మంగళవారం సూర్యనారాయణమూర్తి తీర్థ మహోత్సవం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు. తరువాత వాలీబాల్ పోటీలు నిర్వహించి, విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2వేలు చొప్పున నగదు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి జిల్లాస్థాయి ఎడ్ల పరుగుల ప్రదర్శన జరుగుతుందని, విజేతలకు రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ. 2 వేలు, వెయ్యి రూపాయలు చొప్పున బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు రావులమ్మపాలెం గ్రామంలో రథసప్తమి సందర్భంగా ఈనెల 4న మంగళవారం శ్రీఅక్కులమ్మ పేరంటాలు తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జక్కాన సూర్యనారాయణ, జక్కాన శ్రీరామమూర్తి, జక్కాన సూర్య వెంకటరావు, జక్కాన సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి నేలవేషాలు, తప్పెడగళ్ళు, కోలాటం, భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 4 గంటల నుండి గిడజాలకు చెందిన శ్రీసిద్ధి వినాయక బుర్రకథ బృందం వారిచే బాలనాగమ్మ బుర్రకథ ఏర్పాటు చేశామని చెప్పారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-కె.కోటపాడు : సరస్వతి దేవి జయంతి వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం స్థానిక అయ్యన్న విద్యాసంస్థలలో సరస్వతి దేవి విశేష అర్చన, సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, నూర్జహాన్ దంపతులతో ఆధ్వర్యంలో జరిగిన పూజాకార్యక్రమంలో 40 మంది చిన్నారుల చేత సామూహికంగా అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల బాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి.

వసంత పంచమి వేడుకలు

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి పెదరామాలయంలో గ్రామ పెద్ద పెతకం కంశెట్టి రామ జోగినాయుడు ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలను వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సరగడం జగన్నాథరావు, మల్ల అప్పలనాయుడు, మాధవి, కే.శివరామకృష్ణ, ఎల్లపు పారునాయుడు, దాడి గణేష్, పి.లీలాభాస్కర్, కాండ్రేగుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా బోని గణేష్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర హిందూ షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోని గణేష్ జన్మదిన వేడుకలు పూల్ బాగ్ రోడ్డు కార్యాలయంలో సోమవారం అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సియ్యాద్రి శ్రీనివాసరావు, కోనపల్లి సత్యనారాయణ, ఎండి రాజు, సింగంపల్లి శ్రీనివాసరావు, కసిపల్లి మానిరాజు, మైలపల్లి పోతురాజు, బరుకు గంగరాజు, తెరపల్లి అప్పారావు, ప్రేమ్ కుమార్, పవన్ పాల్గొన్నారు.

ఎండు గడ్డికి గిరాకీ

ఇతర ప్రాంతాల వ్యాపారుల నుంచి కొనుగోలు
పాడి రైతులకు ఆర్థిక భారంగా
మారిన పశు పోషణ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో ఎండు గడ్డికి మంచి గిరాకీ నెలకొంది. దీంతో ఇతర ప్రాంతాల నుండి ట్రాక్టర్ పై గడ్డి తెచ్చి వ్యాపారులు జోరుగా ఎండుగడ్డ విక్రయాలు చేపడుతున్నారు. కాకినాడ జిల్లా, తుని పరిసర ప్రాంతాల నుండి, అనకాపల్లి జిల్లా నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో గల గ్రామాల్లో పండిన వరిగడ్డిని రైతుల నుండి వ్యాపారులు కొనుగోలు చేసుకుని ట్రాక్టర్ పై తీసుకువచ్చి ఈ ప్రాంతంలో విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి సుమారుగా 11 వేల రూపాయల నుండి 13 వేల వరకు ధర పలుకుతుంది. ట్రాక్టర్ పై తెచ్చిన గడ్డిని బట్టి , వ్యాపారులతో పాడి రైతులు బేరమాడి గడ్డిని కొనుగోలు చేసుకుంటున్నారు.

మండలంలోని ఈ ఏడాది అత్యధికంగా వరి సాగు నమోదయింది. భూములు లేని పాడి రైతులు ఎండు గడ్డి కొనుగోలు చేసేందుకు ఎగ బడుతున్నారు. స్థానికంగా పండిన వరి సాగు రైతుల నుండి, ఇతర ప్రాంతాల నుండి ఎండు గడ్డిని ట్రాక్టర్ల పై తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యాపారుల నుండి స్థానిక పాడి రైతులు కొనుగోలు చేసుకుంటున్నారు.

ఈ ఏడాది వరి సాగు అత్యధికంగా పండినప్పటికీ, ఎండు గడ్డి ధర దిగి రాకపోవడం, అత్యధికంగా ధర పలకడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. పశు పోషణ కోసం తప్పని పరిస్థితుల్లో ఎండుగడ్డని అప్పు చేసి పాడి రైతులు కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో పాడి రైతుకు పశుపోషణ భారంగా మారింది.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎండుగడ్డి

మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ అప్పారావు

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

-డిప్యూటీ డిఇఒ అప్పారావు

ప్రజాశక్తి -నక్కపల్లి:పదో తరగతిలో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా తీర్చిదిద్దాలని డిప్యూటీ డిఈఓ అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సోమవారం డిఎల్ పురం, వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతులను నిర్వహించి సబ్జెక్టుల వారిగా విద్యార్థులకు బోధించి, సందేహాలను నివృత్తి చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకమైన దృష్టి పెట్టి, వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. పదిలో మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిఎల్ పురం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. మూడు, ఎనిమిదవ తరగతి పిల్లల స్థాయిని నేరుగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు నరేష్, వేమగిరి నూకరాజు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

పాఠశాలలో ఘనంగా ప్రత్యేక హోమం

ప్రజాశక్తి -కొత్తకోట: వసంత పంచమిని పురస్కరించుకొని రావికమతం మండలం కొత్తకోట ఆర్క్ బర్డ్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక హెూమం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కె. బోస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన సుమారు 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వసంత పంచమి ని పురస్కరించుకొని ప్రత్యేక హెూమంతో పాటు మహా గణపతి పూజను వేద పండితులతో జరిపించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాడెంట్ బోస్ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉన్నతమైన విద్యార్థులకు సర్వస్వతి అనుగ్రహం కలగాలని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

మద్యం షాపులు కేటాయించాలి

-కల్లుగీత సంఘాల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం మండల పరిధిలో కల్లుగీత సహకార సంఘాలకు మద్యం షాపులను కేటాయించాలని కల్లుగీత సహకార సంఘాల సభ్యులు స్థానిక రెవెన్యూ డివిజనల్ కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనేక సంవత్సరాల నుండి నర్సీపట్నం మండల పరిధిలో 600 మంది యాత ఉపకులానికి చెందిన గీత కార్మికులు ఉన్నారని వీరికి సంవత్సరంలో కేవలం మూడు నెలల మాత్రమే కల్లుగీత పని ఉంటుందని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో మండలానికి ఒక మద్యం షాపు చొప్పున రిజర్వేషన్ పరిధిలో కేటాయించారని నర్సీపట్నంకి రిజర్వేషన్ల లో భాగంగా కల్లుగీత కార్మికుల కుటుంబాలకు మద్యం షాపు కేటాయించలేదన్నారు. మద్యం షాపులు కేటాయించి కల్లుగీత కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత సహకార పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షులు బి నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ నూకరాజు, అనసూరి రాంబాబు , టి.అప్పారావు, ఈరెల్లి చిరంజీవి, ఎం సత్తిబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడతున్న సంఘం నాయకులు

సర్పంచ్ దంపతులను సత్కరిస్తున్న గ్రామ పెద్దలు

సర్పంచ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి- మాడుగుల:జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికై గత నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం రోజున ఢిల్లీలో జరిగిన వేడుకల్లో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందిన మాడుగుల మండలం వీరవిల్లిగ్రహారం గ్రామ సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి ఈశ్వరరావు దంపతులను సోమవారం ఆ గ్రామంలో పెద్దలు పూలమాలలు వేసి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రభుత్వం నుండి వచ్చే అన్ని పథకాలను సకాలంలో ప్రజలకు చేరవేసి జాతీయస్థాయిలో గుర్తింపు పొందడం, జిల్లాలో వీరవిల్లి అగ్రహారం గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా గుర్తింపు రావడం ఆనందదాయ కమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న అధికారులు

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:నిరక్షరాస్యులను అక్షరాస్యు లుగా తీర్చిదిద్దారని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం వాలంటీర్ టీచర్లకు ఉల్లాస్ కార్యక్రమం పై శిక్షణ ఇచ్చారు. పంచాయతీకి 10 నుండి 20 మంది నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ఆయా పంచాయతీ గ్రామాల్లో అంగన్వాడి కేంద్రం లేక కమ్యూనిటీ హాలు నందు విద్యను అందించాలని సూచించారు. నిరక్ష్యరాస్యులను ముందుగా గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వాలంటీర్ టీచర్లకు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కే నరేష్, ఏపిఎం శ్రీనివాస్., తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు పలువురు దాతల వితరణ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోదకొండమ్మ అమ్మవారికి సత్యవరం గ్రామానికి చెందిన క్రీర్తిశేషులు పుట్టా సూర్యనారాయణ, కుసుమ ఎర్రయ్యమ్మ దంపతుల కుమారుడు మోహనరావు, కళావతి దంపతుల కుమారుడు సాయి ప్రసాద్ మంచినీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ కుళాయిల నిమిత్త 50 వేలు రూపాయలు నగదు, 50 సిమెంట్ బస్తాలను సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, ముమ్మిన రమణ బాబు, కోన అప్పలనాయుడు,అప్పాన నాయుడు, కలిమి శివ, కలిమి గోపాల్, పోతిన జగదీష్, జొన్నపల్లి నాగరాజు, రాయపు రెడ్డి కొండలరావు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని సీహెచ్. నాగాపురం గ్రామానికి చెందిన దుంపలపూడి సంపత్ చంద్ర గ్రామంలో జరుగుతున్న రామాలయ నిర్మాణానికి తన మిత్ర బృందం ద్వారా సుమారు లక్ష రూపాయలు సేకరించి విరాళాన్ని గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు గ్రామాభివృద్ధికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొలగాని రామారావు, బొప్పన ప్రసాద్, దుంపలపూడి సత్యనారాయణ, సేనాపతి వరహాలు, అప్పన దివాణం, కలం నాగేశ్వరరావు, కలం సత్తిబాబు, కూనిశెట్టి రామారావు, మంతిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నగదుఎను అందజేస్తున్న దాత

కరాటే పోటీల్లో హర్షవర్ధన్ సత్తా

ప్రజాశక్తి హుకుంపేట: స్థానిక పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న జి వి వి సత్యనారాయణ కుమారుడు హర్షవర్ధన్ విశాఖ పోర్టు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎనిమిదోవ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్ షిప్ 2025 లో అండర్ 14 కేటగిరీలో సత్తా చాటాడు. మూడవ స్థానంలో రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ బహుమతి ప్రముఖ సినీ నటుడు సుమన్ చేతుల మీదగా అందుకున్నాడు. హర్షవర్ధన్‌ను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. హర్షవర్ధన్ మాట్లాడుతూ, ఎక్కువ శాతం తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో చదువుపై శ్రద్ధ పెట్టాలని చెపుతారన్నారు. తన తల్లిదండ్రులు చదువుతోపాటు ఏదో ఒక రంగంలో రాణించాలని చెప్పేవారన్నారు. తన ప్రతిభను వెలికి తీసిన తన తల్లిదండ్రులకు రుణపడి ఉంటానన్నాడు.

సత్తా చాటిన హర్షవర్ధన్

హైవేపై సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పాయకరావుపేట నియోజకవర్గంలో హైవేపై అత్యాధునికమైన సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ రాయవరం మండలం ధర్మవరం హైవే నుంచి పాయకరావుపేట పట్టణం వరకూ హైవే జంక్షన్ల లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. సిఐలు కుమారస్వామి జి.అప్పన్న, ఎల్ .రామకృష్ణ పర్యవేక్షణలో సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు పనులను ప్రారంభించారు. 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పర్యవేక్షిస్తున్న సిఐ కుమారస్వామి

తోపుడు బండ్ల కార్మికులపై వేధింపులు ఆపాలి

-సిఐటియు ఆధ్వర్యాన నిరసన

నిరసన చేపడుతున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:సిరిపురం జంక్షన్ గురజాడ కళాక్షేత్రం రోడ్డులోని పటేల్ జంక్షన్ వద్ద తోపుడు బండ్ల కార్మికులపై ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలని, అదే చోట వ్యాపారాలు చేసుకోవడానికి వీలు కలిగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం తోపుడు బండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అక్కడ నుంచి ర్యాలీగా జివిఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకొని అదనపు కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం మాట్లాడుతూ, గత ఆరేళ్ళగా పటేల్ జంక్షన్‌లో తోపుడు బండ్లతో వ్యాపారాలు చేస్తూ జీవనోపాధి పొందుతున్న వారిని అక్కడ నుంచి తొలగించడం సరికాదన్నారు. స్వయం ఉపాధి పొందుతున్న వీరిని గత నెల 22న త్రీ టౌన్ ట్రాఫిక్ పోలీసులు, జివిఎంసి సిబ్బంది వచ్చి తొలగించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తోపుడుబండ్లపై దాడులు పెరిగాయన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని చిల్లర వర్తకులపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు. ఒకపక్క జీవీఎంసీ అధికారులు చిల్లర వర్తకులను ఇబ్బందులు పెడుతుంటే, మరోపక్క ట్రాఫిక్ పోలీసులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల నుండి 22 వ వార్డు పిఠాపురం కాలనీ సంత జరగకుండా ఆపడంతో అక్కడి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. తక్షణం పిఠాపురం కాలనీ లో సోమవారం సంత కొనసాగనివ్వాలని జిల్లా కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చిందని, ఇప్పటికైనా సంతకు అనుమతి ఇవ్వాలన్నారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం లోని 137,151 ప్రకారం చిరు వ్యాపారులను తొలగించకూడదన్నారు. తొలగించే పరిస్థితి వస్తే, అదే ప్రాంతంలో వారి కోసం ప్రత్యేకంగా వెండర్స్ జోన్ ఏర్పాటు చేసి ఉపాధికి హామీ కల్పించవలసి ఉంటుందన్నారు. తక్షణం ట్రాఫిక్ పోలీసులు దాడులు ఆపాలని, తోపుడుబండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలో సోమవారం సంత వచ్చేవారం నుంచి కొనసాగడానికి జివిఎంసి అధికారులు పర్మిషన్ ఇవ్వాలన్నారు. పటేల్ జంక్షన్ లోని 15 తోపుడుబండ్లను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నగర వ్యాప్తంగా ఉన్న తోపుడు బండ్లు, చిల్లర వర్తకలు, సంత వ్యాపారస్తులను కదిలించి జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పటేల్ జంక్షన్ చిరు వ్యాపారులు దశరథ్ జానా, కె. దుర్గారావు,జి.కృష్ణారావు పాల్గొన్నారు.

కత్తితో యువతి హల్‌చల్

కత్తితో సంచరిస్తున్న యువతి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: పట్టణంలో ఓ యువతి సోమవారం కత్తి పట్టుకుని రోడ్డుపై తిరుగుతూ హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. ఆమెను ప్రశ్నించిన కొంతమందికి తాను ప్రభుత్వ ఉద్యోగినని బదులిచ్చింది. ఈ సమాచా రాన్ని తెలుసు కున్న టౌన్ సీఐ గోవిందరావు ఆమెను విచారించి వివరాలు రాబట్టారు. నర్సీపట్నం శారదా నగర్ కు చెందిన ఆమెగా గుర్తించారు. వెంకట అప్పల సూర్య నారాయణ రాజు కుమార్తె గణపతిరాజు భూదేవిగా గుర్తించారు. ఆమె కొన్నాళ్లుగా మానసికంగా బాధపడుతుందని పేర్కొన్నారు.

అబాకస్ జోనల్ లెవెల్ పోటీల్లో

విద్యాంజలి విద్యార్థి కుశ్వంత్ ప్రతిభ

అభినందిస్తున్న ప్రిన్సిపల్ వర ప్రసాద్

ప్రజాశక్తి -కొత్తకోట:అనకాపల్లిలోని ఏడి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో అబాకస్ వేదిక్ మ్యాథ్స్ జోనల్ లెవెల్ కాంపిటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ జోనల్ లెవెల్ పోటీలలో రావికమతం మండలం కొత్తకోట విద్యాంజలి స్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి కేశంశెట్టి కుశ్వంత్ మొదటి స్థానం సాధించాడు. ఆ విద్యార్థిని స్కూల్ ప్రిన్సిపాల్ గట్టా వర ప్రసాద్ సోమవారం ప్రశంసా పత్రం, మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ పోటీలలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు అందులో విద్యార్థి కుశ్వంత్ అత్యంత ప్రతిభ చూపి ట్రోపి సాధించాడు. అలాగే పలువురు విద్యార్థులకు పార్టిసిఫికేషన్ ధ్రువ పత్రాలు అందజేశారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: వక్ఫ్ గత పార్లమెంటులో వక్ఫ్ చట్ట సవరణ కై జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమిస్తూ సవరణలపై అభ్యంతరాలు సేకరించి పార్లమెంటుకు సమర్పించవలసిన జెపిసి ఏకపక్ష ధోరణితో ఏకపక్ష విధానాల తో వక్ఫ్ చట్ట సవరణకై ప్రతిపాదనలు పంపడంపై అవాజ్ విశాఖపట్నం జిల్లా కమిటీ అధ్యక్షులు ఎం.డి అయూబ్, కార్యదర్శి ఎ.ఎఅశ్రఫ్, కమిటీ సభ్యులు కెయు ఖాన్, ముషహద్‌లు ఒక ప్రకటనలో ఆవేదన వెలిబుచ్చారు. వక్ఫ్ కౌన్సిల్ బోర్డులో ముస్లిం యే తరులను సభ్యులుగా చేర్చడం, వక్ఫ్ ఆస్తులను సర్వే కమిషన్ కు బదులుగా, కలెక్టర్ సర్వే చేసేందుకు వీలు కల్పించడం, వక్ఫ్ ట్రిబునల్ నిర్ణయాలను హైకోర్టులో సవాలు చేసేందుకు అనుమతించడం వంటి కీలక మార్పులను బిల్లులో ప్రవేశపెట్టడాన్ని అభ్యంతరం తెలిపారు. వక్ఫ్ ఆస్తులను ఉపయోగిస్తున్న వారి విషయంలో జోక్యం చేసుకోకూడదని అనడం అంటే ఆక్రమణదారులను రక్షణ కల్పించడం తప్ప మరొకటి కాదని వారు విమర్శించారు.వక్ఫ్ భూములు,ఆస్తులు ఏ సామాజిక వర్గం కోసమైతే ఇవ్వబడ్డాయో,ఆ సామాజిక వర్గానికి తీరని నష్టాన్ని చేయడమే అని వారన్నారు. దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను,స్వేచ్ఛను హాని కలిగించే చట్టాలతో రాజ్యాంగ మూల స్వభావమే మార్పుకు గురవుతుందన్నారు. రాజ్యాంగాన్ని, హక్కులను, దేశ ప్రజలే ఐక్యంగా ఉద్యమించి కాపాడుకోవాలని వారన్నారు. చైతన్యవంతమైన ప్రజలు, పాలకుల మోసాలను గ్రహించి. దైనందిన జీవితంలో కుటుంబ పోషణకు ఎన్నో కష్టాలు పడవలసి వస్తుందని గ్రహించి కేంద్ర ప్రభుత్వ కుట్రలు కుతంత్రాలను ఎదిరించాలని, ప్రజలను ప్రజాస్వామ్య వాదులను వారు కోరారు.

1/70 చట్టాన్ని సవరిస్తే ఆదివాసీలకు ముప్పే

మాట్లాడుతున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:1/70 చట్టం సవరణతో ఆదివాసీలకు ముప్పేనని అఖిల భారత గిజన ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా నాయకులు ధనార్జన్, ఇతర సభ్యులు ఖండించారు. సోమవారం ఆదివాసి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ, పెట్టు బడుదారులకు అనుకూలంగా చట్ట సవరణలు సవరించాలని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. 1/70 చట్టం సవరణ జరిగితే ,ఆదివాసీలకు భూమి మీద హక్కు, స్వేచ్ఛ స్వాతంత్ర్యము కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. అమాయక గిరిజనుల భూములను పెట్టుబడిదారులు కారు చౌకగా కొనుగోలు చేస్తారన్నారు. దీంతో, గిరిజనులకు జీవనోపాధి లేకుండా పోయే ప్రమాదం ఉందని తెలిపారు. అరుకు, లంబసింగి ప్రాంత అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉంటే ప్రభుత్వం ద్వారా స్టార్ హెూటల్స్ నిర్మాణం చేపట్టాలన్నారు. అరుకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిందని, అరకు, లంబసింగి ప్రాంతంలో కాఫీ డెవలప్ మెంట్ ఇండస్ట్రీ (ప్రాసెసింగ్ యూనిట్)ప్రభుత్వం ద్వారా పెట్టి గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల్ని కల్పించాలని కోరారు. 1/ 70 చట్టాన్ని సవరణ చేయకుండా ఈ విధమైన నిర్ణయాలు తీసుకొని గిరిజన అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. 1/70 చట్టం సవరణ జరిగితే ఆదివాసులకు అపారమైన నష్టం, అన్యాయం చేసినవారవుతారని, ఒకసారి పునరాలోచించాలన్నారు. లేకుంటే భవిష్యత్లో ఆదివాసి ప్రజా సంఘాలతో ఉద్యమాలు చేయడానికి వెనుకాడబోమని తెలిపారు.

కెజిహెచ్‌కు పెరిగిన కేన్సర్ రోగుల తాకిడి

-నేడు ప్రపంచ కేన్సర్ దినోత్సవం

డాక్టర్ పాండురంగ కుమారి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గత కొన్ని సంవత్సరాలతో పోలిస్తే కేన్సర్ బారిన పడుతున్న రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ వివరాలు తెలిస్తే ప్రజలు ఆందోళనకు గురికాక తప్పదు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రధాయినిగా పేరున్న కెజిహెచ్‌లో కేన్సర్ రోగులకు భరోసా కల్పించే విధంగా వ్యాధి నివారణకు, అవగాహన కల్పించడం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నారు. ఆధునిక యంత్రాలు కెజిహెచ్‌కు వచ్చాయి. వీటి కోసం సుమారు రూ.50 కోట్లు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో కెజిహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగ అధిపతి డాక్టర్ పాండురంగ కుమారి ప్రజాశక్తికి 2024 జనవరి నుంచి డిసెంబర్ నెల వరకు కేన్సర్ రోగులకు అందిన వివిధ రకాల వైద్య సేవల వివరాలు తెలిపారు.

2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు కేన్సర్ బాధిత అవుట్ పేషెంట్లు 8,174 మంది వచ్చారని, వీరిలో ఇన్ పేషెంట్లు 4,741 మంది ఉండగా, కీమోథెరపీ తీసుకున్న వారు 5,994 మంది, సర్జరీలు చేసుకున్న వారిలో మేజర్ 149 ఉండగా, మైనర్ 103 ఉన్నాయని తెలిపారు.

మెడికల్ అంకాలజీ ఓపి 4959, ఇన్ పేషెంట్లు 3384 మంది, మేజర్ ఆపరేషన్లు 5072 జరిగాయని పేర్కొన్నారు. సర్జికల్ ఆంకాలజీలో ఓపి 148, ఇన్ పేషెంట్లు 165 మంది, మేజర్ ఆపరేషన్లు 149, మైనర్ ఆపరేషన్లు 103 జరిగాయని వివరించారు. రేడియేషన్ ఆంకాలజీలో ఓపి 3067, ఇన్ పేషెంట్లు 1192 మంది ఉండగా, మేజర్ ఆపరేషన్లు 922, మైనర్ ఆపరేషన్లు 528 జరిగినట్లు తెలిపారు. ఆధునిక వైద్య పరికరాలు రావటంతో ఖరీదైన వైద్య సేవలను ఉచితంగా పొందే అవకాశం కెజిహెచ్‌లో కొద్ది నెలలలో అందుబాటులోకి రానుందని తెలిపారు.

జీడి మామిడి తోటల బహిరంగ వేలం

హాజరైన వేలం పాట దారులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక జిల్లా ఫారెస్ట్ కార్యాలయ ఆవరణలోని నర్సీపట్నం, అనకాపల్లి రేంజ్ పరిధిలో గల జీడి మామిడి తోటలకు బహిరంగవేలాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. నర్సీపట్నం రేంజ్ పరిధిలో చినరాచపల్లి, నాతవరం, ఆరిలోవ, కోటవురట్ల, అహ్మద్ షరీఫ్ తోట, అనకాపల్లి, చోడవరం రేంజ్ పరిధిలో జీడి మామిడి తోటల నుండి వచ్చే ఫలసాయాన్ని సేకరించుటకు గాను బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ సామ్యూల్ మాట్లాడుతూ, 18 ప్లాంటేషన్స్ లో 639 హెక్టార్లలో జీడి మామిడి తోటలను బహిరంగ వేలం వేశామన్నారు.ఇందులో ఐదు ప్లాంటేషన్లకు వేలం జరపగా 32 లక్షల 43 వేల ఆదాయం వచ్చిందన్నారు. వేలం జరగని ప్లాంటేషన్లను అటవీ శాఖ పరిధిలో సేకరించడం జరుగుతుందన్నారు.అటవీ సంపదను అక్రమంగా ఎవరైనా పొందాలని చూసినా చట్ట పరంగా చర్యలు తప్పవన్నారు.అటవీ ప్రాంతంలో వణ్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రతి మూడు మీటర్లకు ఒక లైన్ ఉంటుందని తెలిపారు. దీంతో అగ్గి రాజుకోకుండా ఉంటుందని వివరించారు. అడవులను రక్షించడం అందరి బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల కరక కొండపైకి సర్వేలో భాగంగా వెళ్లిన వారిని అడ్డగించడం జరిగిందని దానిపై విచారణ జరుగుతుందని అనంతరం సరైన చర్యలు ఉంటాయని సామ్యూల్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి లక్ష్మీనర్స్, ఆటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నువ్వుల పంట పరిశీలన

పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:ప్రధమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల నూనె గింజల సాగులో భాగంగా మండలంలోని కొండపాలెం, కెపి. అగ్రహారం గ్రామాల్లో నువ్వు పంటను సోమవారం కొండెంపూడి కేవికే శాస్త్రవేత్తలు పరిశీలించారు. నువ్వు పంటలో ఆకుమచ్చ తెగులు ఆశించినట్లు గుర్తించారు. సస్యరక్షణ చర్యలు పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సౌజన్య, రామునాయుడు పాల్గొన్నారు.